సాక్షి అనకాపల్లి

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



స్టేషన్‌లోనే వసూళ్లు!



- ఫిర్యాదు చేసినా కేసు పెట్టకుండా కాలయాపన
- నేరుగా స్టేషన్‌లోనే రూ.2 లక్షలు తీసుకున్నట్లు సీసీ ఫుటేజీ
- అనకాపల్లి టౌన్ సీఐకి బిగుస్తున్న ఉచ్చు!



'అసలు దోషి ఎవరు' అంటూ ఆగస్టు 17న 'సాక్షి' కథనం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

కూటమి ప్రభుత్వంలో పోలీస్ స్టేషన్లు ఏకంగా వసూళ్లకు కేంద్రంగా మారిపోతున్నాయా? అక్కడ ఇక్కడ ఎందుకంటూ నేరుగా స్టేషన్‌లోనే లంచాలు వసూలు చేస్తున్నారా? అంటే.. గత నెలలో అనకాపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన వ్యవహారాన్ని గమనిస్తే ఇట్టే తెలుస్తోంది. బాధితుడి నుంచి ఫిర్యాదు అందినప్పటికీ కేసు నమోదు చేయకుండా ఏకంగా అనకాపల్లి స్టేషన్‌లోనే రూ.2 లక్షలు వసూలు చేసిన వ్యవహారం సీసీ ఫుటేజీ సాక్షిగా బయటపడినట్టు సమాచారం. నేరుగా స్టేషన్‌కే వచ్చి రూ.2 లక్షలు అందజేసినట్టు ఏసీబీని ఆశ్రయించిన పెందుర్తి వ్యాపారి స్పష్టం చేయడంతోపాటు స్టేషన్ సీసీ ఫుటేజీలో కూడా అదే దృశ్యం కనిపించినట్లు తెలుస్తోంది. ఈ రూ.2 లక్షలు ఎస్‌ఐ తీసుకున్నప్పటికీ అంతిమంగా ఎవరి జేబులోకి వెళ్లాయనే కోణంలో ఏసీబీ దృష్టి సారించినట్టు సమాచారం. ఈ వ్యవహారంలో 'విజయ'వంతంగా జేబులోకి వేసుకున్న వ్యక్తిని కూడా నిందితుడిగా ఏసీబీ చేర్చనున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా ఫిర్యాదు అందినప్పుడు కేసు నమోదు చేయకుండా ఉద్దేశపూర్వకంగా నాన్చుడు ధోరణి అవలంబించిన అనకాపల్లి సీఐ పేరును కూడా కేసులో ఏసీబీ చేర్చనున్నట్లు సమాచారం. స్టేషన్‌లోనే లంచాలు తీసుకుంటున్న సీసీ ఫుటేజీ లభించడంతో ఇప్పుడు ఏ చర్యలు తీసుకుంటారనేది తేలాల్సి ఉంది. అయితే ఈ వ్యవహారంలో అసలు దోషి తప్పించుకుంటున్నారంటూ ఆగస్టు 17వ తేదీన 'సాక్షి'లో 'అసలు దోషి ఎవరు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇప్పుడు ఏసీబీ తాజా విచారణలో అసలు దోషి బయటపడే అవకాశం ఉన్నట్టు స్పష్టమవుతోంది.

ఎస్‌ఐని ఇరికించి..!

వాస్తవానికి సదరు స్టేషన్‌లో అన్ని వ్యవహారాలు నడిపిస్తున్న వ్యక్తి.. ఎస్‌ఐని పావుగా వాడుకుంటున్నట్టు మొదటి నుంచీ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రిన్సిపల్ ఎస్‌ఐవి నువ్వేనంటూ వసూళ్లకు దింపినట్టు కూడా అనకాపల్లి పోలీసు వర్గాల్లో చర్చ జరిగింది. గతంలో ఇదే ప్రాంతంలో పనిచేసిన సమయంలో ఒక భూమి విషయంలో తలదూర్చడంతో ఫిర్యాదులు ఎదుర్కొన్న సదరు వ్యక్తినే ఈ లంచాల అవతారంలో కూడా కీలక సూత్రధారిగా విమర్శలు వినిపించాయి. అయితే, అత్యంత తెలివిగా నేరుగా రంగంలోకి దిగకుండా ఎవరినో ఒకరిని ముందుకుపెట్టి కథ నడిపిస్తూ విజయవంతంగా ముందుకెళుతున్నారనే పేరు ఉంది. ఈ అవినీతి కథలో మొత్తంగా వసూలు చేసిన రూ.2 లక్షలు ముందుగానే స్టేషన్‌లోనే అప్పగించినట్టు ఫిర్యాదుదారుడు ఏసీబీకి తెలిపాడు. అయితే రూ.2 లక్షలు ఎవరి జేబులోకి వెళ్లాయనే కోణంలో ఇప్పుడు విచారణ జరుగుతున్నట్టు సమాచారం. గత ఏడేనిమిదేళ్లుగా అనకాపల్లి ప్రాంతంలోనే ఎస్‌ఐ దాసరి ఈశ్వరరావు విధులు నిర్వర్తిస్తున్నారు. కశింకోట, అనకాపల్లి రూరల్, సీసీఎస్ తదితర పోస్టింగులు నిర్వర్తించారు. గత ఏడాది కాలంగా అనకాపల్లి టౌన్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఈ తరహా అవినీతి ఆరోపణలు లేవనే పేరు డిపార్టుమెంటులో ఉంది. ప్రధానంగా టౌన్ స్టేషన్‌కు వచ్చిన తర్వాత ఈ వసూళ్ల ఆరోపణలు మొదలైనట్టు తెలుస్తోంది. అన్ని వ్యవహారాల్లోనూ సదరు ఎస్‌ఐ ఈశ్వరరావును ముందుపెట్టి వసూళ్లకు దింపి.. 'విజయ'వంతంగా వ్యవహారం నడిపింది ఎవరనేది ఏసీబీ ఆధారాలతో సహా తేల్చేపనిలో ఉన్నట్టు సమాచారం.

ఎవరి జేబులోకి రూ.2 లక్షలు..!

పెందుర్తికి చెందిన బంగారు వ్యాపారి అప్పారావు అనకాపల్లిలో ఖాళీగా ఉన్న తన షాపును ఈ ఏడాది మే నెలలో శాస్తి మండల్ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చి రూ.రెండు లక్షలు అడ్వాన్స్ తీసుకున్నాడు. శాస్తి మండల్ జూలై 16న తన అద్దె షాపు నుంచి పక్కనే ఉన్న బంగారు దుకాణంలోకి రంధ్రం తవ్వి బంగారు ఆభరణాలను దొంగలించడానికి ప్రయత్నించి, విఫలం కావడంతో పరారయ్యాడు. పక్క షాపు యజమాని బుద్ద శ్రీనివాసరావు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ ఈశ్వరరావు షాపు యజమాని అప్పారావును పిలిపించి విచారించారు. ఈ కేసులో ఇరికించకుండా అడ్వాన్స్‌గా తీసుకున్న రూ.2 లక్షలు, షాపు తాళాలు ఇవ్వడానికి లక్ష రూపాయలు ఎస్‌ఐ డిమాండ్ చేశాడు. అతడు అంత ఇచ్చుకోలేనని చెప్పడంతో రూ.50 వేలకు తగ్గించారు. దీంతో అతడు ఏసీబీని ఆశ్రయించగా ఆగస్టు 14వ తేదీన ఎస్‌ఐ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అయితే నేరుగా స్టేషన్‌లోనే రూ.2 లక్షలు ఎస్‌ఐకి అందజేసినట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన సీసీ ఫుటేజీని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. అయితే ఫిర్యాదు వచ్చినప్పటికీ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండా స్టేషన్ హౌస్ ఆఫీసర్ అయిన సీఐ మిన్నకుండిపోవడం బట్టి చూస్తే వ్యవహారమంతా ఆయనకు తెలిసే జరిగిందనే అనుమానాలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సీఐపై కూడా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

నేత్రపర్వంగా వెంకన్న ధ్వజారోహణం


ఉపమాక ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ధ్వజపటాన్ని ఎగుర వేస్తున్న అర్చక స్వాములు

అష్టదిక్పాలకులకు బ్రహ్మోత్సవ ఆహ్వానం

నక్కపల్లి: ఉపమాక శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన బుధవారం ధ్వజారోహణం కార్యక్రమం వైభవంగా జరిగింది. గరుడాద్రిపై మూలవిరాట్‌కు నిత్యపూజలు, అర్చనలు నిర్వహించిన అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత శ్రీకల్కి వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులను, సుదర్శన పెరుమాళ్లను (చక్రత్తాళ్వార్) పెద్ద పల్లకిలో ఉంచి భేరీ పూజ నిర్వహించారు. ఆలయంలో అష్టదిక్పాలకులకు ప్రత్యేక ఆహ్వానం పలుకుతూ గ్రామ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద ధ్వజపటాన్ని ఎగుర వేసి స్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తజనంతోపాటు, అష్ట దిక్పాలకులు కూడా ఆహ్వానితులేనంటూ ఈ కార్యక్రమం చేయడం జరిగిందని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు. గరుడ పొంగలి నివేదన చేసి భక్తులకు ప్రసాదంగా పంచిపెట్టారు. సాయంత్రం సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో అధిష్ఠింపజేసి గ్రామ బలిహరణలు పూర్తి చేశారు. రాత్రి శేషతల్ప వాహనంపై స్వామివారి తిరువీధి సేవ నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో గోదాదేవి అమ్మవారికి ప్రతిరోజు సాయంత్రం లక్ష్మీ సహస్ర కుంకుమార్చన జరుగుతుందని అర్చకులు తెలిపారు.


శేషతల్ప వాహనంపై స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు



అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గమ్మ

పరమేశ్వరుడికే అన్నం పెట్టిన అమ్మ అన్నపూర్ణమ్మ.. అందరి కడుపు నింపుతూ జగతిని కాపాడుతూ, సుఖశాంతులను ప్రసాదిస్తోంది. అన్నపూర్ణమ్మ అవతారంలో బుధవారం కనకదుర్గమ్మవారు అనుగ్రహించారు. అనకాపల్లి తుమ్మపాల పంచాయతీలోని వాటర్ వర్క్ కాలనీలోని శ్రీదుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రుల్లో మూడో రోజున అమ్మవారు ఇలా కనుల పండువగా దర్శనమిచ్చారు. 200 మంది మహిళలు కుంకుమ పూజలు చేశారు.

మత్స్యకారుల్లో ఆగ్రహ జ్వాల

- పది రోజులుగా దీక్షలు చేస్తున్నా స్పందించని హోంమంత్రి
- తమను పట్టించుకోకపోగా స్టీల్‌ప్లాంట్‌పై సమావేశం పెట్టడంతో రగిలిపోయిన గంగపుత్రులు
- రోడ్డుపై నిప్పు పెట్టి రాకపోకలు నిలిపివేత
- బల్క్‌డ్రగ్ పార్క్ పనులు చేస్తున్న ఎస్‌ఆర్‌ఆర్ కంపెనీ వాహనాల అడ్డగింత
- భారీగా మోహరించిన పోలీసులు
- ఇరు వర్గాల మధ్య తోపులాట
- రాత్రి పొద్దు పోయాక కూడా దీక్ష కొనసాగిస్తున్న మత్స్యకారులు

టెంటు వేయవద్దన్నా వెరవలేదు.. మైకు పెట్టవద్దనా పట్టించుకోలేదు.. నిరసన తెలపడమే ముఖ్యమనుకున్నారు.. ముందు మండుటెండలో, తర్వాత గొడుగుల కింద, నాలుగు రోజులు గడిచాక టెంట్ల కింద శాంతియుతంగా నిరాహార దీక్షలు కొనసాగించారు. బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ వేడుకుంటున్నారు. కానీ పది రోజులైనా తమను పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర హోంమంత్రి స్టీల్‌ప్లాంట్‌పై సమావేశం పెట్టారని తెలిశాక మాత్రం ఆగ్రహంతో ఊగిపోయారు. తమ ప్రజాప్రతినిధి నిర్లక్ష్య భావంపై రగిలిపోయారు.


నూకతాత ఆలయం వద్ద పోలీసులకు, మత్స్యకారులకు మధ్య వాగ్వాదం

నక్కపల్లి: గుండెల్లో మంట ఆగ్రహ జ్వాలగా మారింది. మంట పెట్టి రహదారిని దిగ్బంధం చేసింది. బల్క్‌డ్రగ్ పార్కు పనులను అడ్డుకుంది. ఇది పది రోజులుగా నిరశన తెలుపుతున్న గంగపుత్రుల ఆవేదన. ఎన్నికల ముందు రాజయ్యపేట ఓట్ల కోసం వచ్చిన వంగలపూడి అనిత బల్క్‌డ్రగ్ పార్కుకు, సముద్రంలోకి కంపెనీల వ్యర్థ జలాల విడుదల కోసం వేస్తున్న పైపులైన్లకు తాను వ్యతిరేకమని ఓట్లు అడిగారు. ఆమెకు రాజయ్యపేట గ్రామ ప్రజలు 2 వేల మెజార్టీ ఇచ్చారు. అంత మద్దతిచ్చినా ఆమె కనీసం తమ గోడు వినడానికైనా రాలేదన్న అసంతృప్తి వారిలో నెలకొంది. అది బుధవారంనాటి పరిణామాలతో ఆగ్రహంగా మారింది. ఆర్సిలరీ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుపై ఈనెల 27న నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణను విజయవంతం చేయాలని సంబంధిత గ్రామాల పెద్దలతో హోంమంత్రి అనిత సమావేశం జరిపారని తెలుసుకున్న గంగపుత్రులు మరింత కోపంతో ఊగిపోయారు. తమ ఆవేదనకు విలువ ఇవ్వనందుకు నిరసనగా బల్క్‌డ్రగ్ పార్క్ పనులు చేస్తున్న ఎస్‌ఆర్‌ఆర్ కంపెనీ వాహనాల రాకపోకలు అడ్డుకున్నారు. రోడ్డుపై నిప్పు పెట్టి రాకపోకలు బ్లాక్ చేశారు. బల్క్‌డ్రగ్ పార్క్ పనులు చేస్తున్న ఎస్‌ఆర్‌ఆర్ కంపెనీ వాహనాల రాకపోకలు అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న నక్కపల్లి, ఎస్.రాయవరం సీఐలు కుమారస్వామి, రామకృష్ణ ఆధ్వర్యంలో వందలాది మంది పోలీసులు గ్రామంలోకి వెళ్లారు. నూకతాత ఆలయం వద్ద టెంటు వేసి ఆందోళన కొనసాగిస్తున్న మత్స్యకారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ప్రస్తుతం గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మత్స్యకారులు హోం మంత్రి అనితకు వ్యతిరేకంగా ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేస్తున్నారు. వీరికి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మద్దతు తెలిపారు. కాకినాడ సమీపంలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు సిద్ధపడిన దివీస్ కంపెనీకి వ్యతిరేకంగా పిఠాపురం నియోజకవర్గానికి చెందిన వారు ఉప్పాడలో రోడ్డెక్కి ఆందోళన చేస్తే అక్కడి ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారని, వెంటనే కమిటీ ఏర్పాటు చేస్తానని ప్రకటించారని మత్స్యకారులు పేర్కొన్నారు. ఇక్కడ రాజయ్యపేట మత్స్యకారులు పది రోజులుగా నిరాహారదీక్ష చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యేగా అనిత ఒక్కసారి కూడా గ్రామానికి రాలేదని, తమతో చర్చలు జరపలేదని వారు ఆగ్రహంతో ఉన్నారు. రాత్రి పొద్దుపోయాక కూడా దీక్షలు కొనసాగించారు.


రాజయ్యపేటలో రోడ్డుపై నిప్పు పెట్టిన మత్స్యకారులు


చీకటి పడినా ఆగని ఆందోళన

యలమంచిలి ఎంపీపీపై అవిశ్వాసం నోటీసు

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికైన యలమంచిలి మండల పరిషత్ అధ్యక్షుడు బోదెపు గోవింద్‌పై నలుగురు ఎంపీటీసీ సభ్యులు బుధవారం అధికారులకు అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో యలమంచిలి మండల పరిషత్‌లో 7 ఎంపీటీసీ స్థానాల్లో అన్నింటినీ వైఎస్సార్‌సీపీ సభ్యులే కైవసం చేసుకున్నారు. వారిలో ఏటికొప్పాక-2 ఎంపీటీసీ నగిరెడ్డి దేవుడమ్మ మరణించారు. మిగిలిన ఆరుగురిలో నలుగురు ఎంపీటీసీలకు ప్రలోభాల ఎర చూపి జనసేన పార్టీలో చేర్చుకున్నారు. వైస్ ఎంపీపీ, రేగుపాలెం ఎంపీటీసీ రాజాన సూర్య చంద్రశేషగిరిరావు, జంపపాలెం, ఏటికొప్పాక-1, కొత్తలి ఎంపీటీసీలు శిలపరశెట్టి ఉమాగణేష్, నగిరెడ్డి అమ్మాజీ, బర్రె శివలక్ష్మి జనసేనలో చేరారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రోద్బలంతో ఎన్నికైన పార్టీని కాదని అనైతికంగా పార్టీ మారిన ఎంపీటీసీలతో పదవి కోసం అవిశ్వాసానికి తెర తీశారన్న చర్చ ప్రజల్లో ఉంది. ఎంపీపీ పదవిలో బోదెపు గోవింద్ ఇప్పటికే నాలుగేళ్లు పూర్తి చేశారు. మిగిలిన ఒక్క ఏడాది పదవీ కాలం కోసం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఎంపీటీసీలతో కూటమి నేతలు అరకులో క్యాంపు నడుపుతున్నట్టు తెలుస్తోంది. అధికారులు త్వరలో బలపరీక్ష నిర్వహించనున్నారు.

డిసెంబరుకు పోలవరం పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ ఆదేశం

పాయకరావుపేట: పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ నిర్మాణాన్ని డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. పాయకరావుపేట వద్ద జరుగుతున్న పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ మట్టి, రాతి తవ్వకం పనులను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. జల వనరుల శాఖ యలమంచిలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పాయకరావుపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పాయకరావుపేట తహసీల్దార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ సైనికుల కోసం పెన్షన్ పోర్టల్ ప్రారంభం


అగ్గాల హనుమంతరావు

అనకాపల్లి: కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో మాజీ సైనికులకు పెన్షన్ పోర్టల్ స్పర్శ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అగ్గాల హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త జిల్లాలో మాజీ సైనికులు సుమారు 7,100 మంది ఉన్నారని, ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు జిల్లా సోల్జర్స్ బోర్డు ఉండేదని, కొత్త జిల్లాలో తాత్కాలికంగా స్పర్శ్ సెంటర్‌ని ఏర్పాటు చేశారని చెప్పారు. మాజీ సైనికుల కోసం కేంద్ర ప్రభుత్వం స్పర్శ్ అనే ఒక పెన్షన్ వ్యవస్థని 2021లో తీసుకొచ్చిందని, ఈ డిజిటల్ ప్లాట్‌ఫారం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. జిల్లా సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని నెహ్రూచౌక్ వద్ద ఏర్పాటు చేశామని, మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9573043507ను సంప్రదించాలని ఆయన కోరారు.

గోవాడ సుగర్స్‌ను ఆదుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాసుబాబు

కె.కోటపాడు: గోవాడ సుగర్ ఫ్యాక్టరీని రాష్ట్రంలో గల కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు కోరారు. కె.కోటపాడులో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఫ్యాక్టరీ పరిస్థితులపై జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను ఇటీవల కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని కాసుబాబు అన్నారు. చెరకు రైతులకు రూ.30 కోట్లు, కార్మికులకు రూ.10 కోట్లు బకాయిలు ఉన్న విషయాన్ని ఫ్యాక్టరీ పరిధిలో గల ఇద్దరు ఎమ్మెల్యేలకు తెలిసినా వారు పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. ప్రస్తుత ఫ్యాక్టరీ దీన పరిస్థితిపై ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించి పూర్వవైభవం వచ్చేలా సహకారాన్ని అందించాలని కాసుబాబు కోరారు. కార్యక్రమంలో కొరిబిల్లి శంకరరావు, గొర్లె దేముడుబాబు, శెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ సెక్రటరీలకు అన్యాయం

అనకాపల్లి టౌన్: వార్డ్ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రోసెసింగ్ సెక్రటరీల నుంచి ఎడ్యుకేషన్‌ను వేరు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీ వార్డ్ ఎడ్యుకేషన్ సెక్రటరీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేష్ కుమార్ అన్నారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇటీవల జీఎస్‌డబ్ల్యూఎస్ మంత్రి చేసిన ప్రకటనను వెంటనే విరమించుకోవాలన్నారు. ఎడ్యుకేషన్ సెక్రటరీల నియామక ఉత్తర్వులకు విరుద్ధంగా ఇప్పుడు కొత్తగా వార్డ్ ఎడ్యుకేషన్ సెక్రటరీలను డేటా ప్రాసెసింగ్ పనులకు మాత్రమే పరిమితం చేయాలని చూడడం అన్యాయమన్నారు. ఇటువంటి నిర్ణయాల వల్ల భవిష్యత్‌లో ఎడ్యుకేషన్ సెక్రటరీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. తక్షణమే ఇటువంటి నిర్ణయాలను విరమించుకోవాలని ఆయన అన్నారు.

ఆధారాలు చూపని నగదు స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లోఎలాంటి ఆధారాలు చూపకుండా అధిక మొత్తంలో తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ), రైల్వే భద్రతా దళం బుధవారం తనిఖీలు చేపట్టగా తెలంగాణాకు చెందిన ముగ్గు రు వ్యక్తులు విశాఖ మీదుగా ఒడిశా, కంతాబంజికు ప్రయాణిస్తున్నారు. వీరు తమతో రూ.43 లక్షలను తరలిస్తున్నారు. వీటికి ఎటువంటి పత్రాలు చూపనందున రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. తెలంగాణాలో ఇటుక బట్టీల్లో పనిచేసే కూలీలకు ఇచ్చేందుకు ఈ డబ్బు తీసుకెళ్తున్నట్టు చెప్పారని జీఆర్పీ పోలీసులు తెలిపారు.

ఉచిత విద్య, వైద్యం హామీలకే పరిమితమా..!

- వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే నడపాలి
- జీవో నంబర్ 590ను తక్షణమే రద్దు చేయాలి
- సీపీఐ ఆందోళన



నెహ్రూచౌక్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల్లో పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని ధర్నా

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం మెడికల్ విద్యను పేద ప్రజలకు దూరం చేయాలనే ఉద్దేశ్యంతో పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారీ తనంగా ఉండాల్సిన పాలకులు విద్య ,వైద్యం ఉచిత విద్య అనే హామీలు కేవలం కాగితాలకే పరిమితం చేస్తున్నారని, ప్రభుత్వం ఆధీనంలో ఉండాల్సిన విద్య, వైద్యా రంగాలను ప్రైవేటుపరం చేసి కార్పొరేట్ దోపిడీ వర్గాలకు అప్పగించే విధంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. రాష్ట్రంలో అందరికీ వైద్య విద్యను అభ్యసించడానికి అవకాశం కల్పించడానికి నేషనల్ మెడికల్ కౌన్సిల్‌ను గత ప్రభుత్వం కోరిక మేరకు మన రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ప్రభుత్వ రంగ సంస్థలో నడపడానికి నిధులు విడుదల చేయడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆరు మెడికల్ కళాశాలలు ప్రారంభించగా, మిగిలిన మెడికల్ కళాశాలలను అభివృద్ధి చేయకుండా మొత్తం 17 మెడికల్ కళాశాలలు కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు ఇస్తూ జీవో నంబర్590ని జారీ చేయడం అన్యాయమన్నారు. మెడికల్ కళాశాలలో జీవో నెంబర్ 107, 108 అమలు పరుస్తూ ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించి ఏ క్యాటగిరి కన్వీనర్ కోటా కింద, బి కేటగిరిలో ఏడాదికి రూ.12 లక్షలు, సీ క్యాటగిరిలో ఏడాదికి రూ.20 లక్షలుగా నిర్ణయించినట్టు తెలిపారు. కూటమి అధికారంలోకి రాగానే 100 రోజుల్లోనే ఈ జీవో నెంబర్ 107, 108 రద్దు చేస్తాని ఇచ్చిన హామీ ఇచ్చి ఏంచేశారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సభ్యుడు దేవుడు బాబు, బి.బాబ్జి , సత్తిబాబు, ఆర్.శంకరరావు, సత్యనారాయణ, పోతురాజు పాల్గొన్నారు.

రావిచెట్టుకు, వేపచెట్టుకు కల్యాణం


కాగిత దుర్గా దేవి ఆలయంలో వెలసిన రావిచెట్టు, వేప చెట్టు


రావి, వేప చెట్లకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: శరన్నవరాత్రులు పురస్కరించుకుని కాగిత గ్రామంలో దుర్గాదేవి అలయంలో బుధవారం రాత్రి రావి చెట్టుకు, వేపచెట్టుకు కల్యాణం నిర్వహించారు. గ్రామంలో దుర్గా దేవి ఆలయంలో రావిచెట్టు వేప చెట్టులు మొలిచాయి. ఈ రెండు చెట్ల వద్ద గ్రామస్తులు నిత్యం పూజలు చేస్తుంటారు. శరన్నవరాత్రులను పురస్కరించుకుని బుధవారం రాత్రి ఈ రెండింటికి వేద మంత్రోచ్ఛారణల మద్య కల్యాణం నిర్వహించినట్టు గ్రామస్తులు తెలిపారు. ఈ కల్యాణం తిలకించేందుకు గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఏసీపీఆర్ఈఈ పథకంపై అవగాహన


ఏసీపీఆర్ఈఈ పథకంపై అవగాహన కల్పిస్తున్న ఈఎస్ఐ అధికారులు

విశాఖ సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఏసీపీఆర్ఈఈ-2025(స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయీస్) పథకంపై బుధవారం హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ కార్యాలయంలో యజమానులు, ఉద్యోగులకు ఈఎస్ఐ ఉప ప్రాంతీయ అధికారులు, గాజువాక బ్రాంచ్ మేనేజర్ అవగాహన కల్పించారు. ఈ పథకంలో ఎవరైనా చేరకపోతే తక్షణమే చేరాలని సూచించారు. ఈ ఏడాది డిసెంబరు 31 వరకు గడువు ఉందన్నారు. 10 లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఉన్న కర్మాగారాలు, సంస్థలు సువిధ, ఎంసీఏ, ఈఎస్ఐసీ పోర్టళ్లలో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఈఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కె. సాహూ, అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్యామ్ ప్రసాద్, గాజువాక బ్రాంచ్ మేనేజర్ ఎల్.కృష్ణ ప్రసాద్, అసిస్టెంట్ డి.చిరంజీవి (అసిస్టెంట్), హిందూస్తాన్ షిప్‌యార్డ్ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో ఆక్వా రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ సూచన


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ

దేవరాపల్లి: ఆక్వా రైతులంతా నెల రోజుల్లోగా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకొని లైసెన్స్‌లు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి జి. విజయ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఆక్వా రైతులతో సమావేశం నిర్వహించారు. దేవరాపల్లి మండలంలో 72 చెరువులు ఉన్నాయని, సదరు రైతులంతా రిజిస్ట్రేషన్ చేయించుకొని, లైసెన్స్ పొందాలని సూచించారు. ప్రతి ఆక్వా రైతు పట్టాదారు పాసు పుస్తకం, వన్‌బీ, ఆధార్, నో అబ్జెక్షన్ ధ్రువపత్రం, పంచాయతీ తీర్మానం పత్రాలను సమర్పించాలన్నారు. చేపలకు మేతగా పౌల్ట్రీ వ్యర్థాలు, నిషేధిత ఆహార పదార్థాలు వాడితే చట్ట ప్రకారం కఠిన చర్యలతో పాటు రూ. 2 లక్షల వరకు జరిమానా విధిస్తామని ఆమె హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 1862 చెరువులు ఉన్నాయని, వీటిలో 1443 చెరువులకు అనుమతులు ఉన్నాయన్నారు. ముఖ్యంగా వెనామి రొయ్యలు, పంగసియాస్, రాంగడి, బొచ్చు చేపలను పెంచితే స్థానిక మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. మండల వ్యవసాయ అధికారి కాంతమ్మ, మాడుగుల మత్స్యశాఖ అభివృద్ధి అధికారి నాగమణి, మత్స్యశాఖ అధికారులు ఎ.రమణ, రజాక్ పాల్గొన్నారు.

పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

నర్సీపట్నం: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల 12వ పీఆర్‌సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పీఆర్‌సీ పెంచి జీతాలు పెంచాలన్నారు. డీఏ, సరెండర్ లీవ్‌ల బకాయిలు చెల్లించాలన్నారు. మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సీఎం ఇచ్చిన హామీ మేరకు గత జూలైలో జరిగిన మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు జీతం చెల్లించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన 13 గంటల పనిదినాన్ని రద్దు చేయాలన్నారు. మహిళలతో రాత్రి పూట షిఫ్ట్‌లో చేయించే విధానానికి స్వస్తి పలకాలన్నారు. రిటైర్మెంట్, అనారోగ్యంతో చనిపోయిన వారి స్థానాల్లో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచాలన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలన్నారు. కార్మికుల సమస్యలు ఏ ఒక్కటి పరిష్కారం చేయకుండా మాది మంచి ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకోవటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.లోవరాజు, బాబురావు, వి.రమణ, నూకరాజు, సంపత్, అర్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం


పెద్దేరు నదిలో నుంచి బయటలకు తీసిన రోహిత్ మృతదేహం

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేట తాచేరు నదిలో గల్లంతైన 8వ తరగతి విద్యార్థి ఆడారి రోహిత్(13) శవమై తేలాడు. మంగళవారం సాయంత్రం తన తమ్ముడు రిషిత్‌తో కలిసి పేట తాచేరు నదిపై గండి పడిన తాచేరు డైవర్షన్ రోడ్డు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ తాచేరు నదిలో పడిపోయి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు తమ సిబ్బంది,అగ్నిమాపక సిబ్బందితో రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినా రోహిత్ ఆచూకీ దొరకలేదు. బుధవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో ఎస్ఐ గాలింపు చర్యలు చేపట్టారు. విజయరామరాజుపేట గాయత్రి కాలేజీ ఎదురుగా ఉన్న పెద్దేరు నదిలో తుప్పల్లో రోహిత్ మృతదేహం లభ్యమైంది. మంగళవారం మధ్యాహ్నం ఇంటి వద్ద అన్నం తిని ఆడుకోవడానికి వెళ్లిన తమ కుమారుడు బుధవారం శవమై తిరిగి రావడంతో బాలుడి తల్లిదండ్రులు గోపి, సూర్యలక్ష్మి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కోతకు గురైన తాచేరు డైవర్షన్ రోడ్డును బాగు చేసి ఉంటే తమ కుమారుడు బతికేవాడని మృతుడి తల్లిదండ్రులతో పాటు గ్రామ సర్పంచ్ విజయ్‌కుమార్, కోఆపరేటివ్ మాజీ అధ్యక్షుడు గోవింద, రాష్ట్ర అఖిల గాండ్ల తెలుకుల సంఘం మాజీ డైరెక్టర్ చిత్రాడ జగదీష్ వాపోయారు.

వెర్రిగెడ్డ ఆనకట్టకు గండి


గండి పడి వృథాగా పోతున్న నీరు


వెర్రిగెడ్డ ఆనకట్టలో అడుగంటిన నీటి నిల్వలు

నాతవరం: వెర్రిగెడ్డ ఆనకట్ట గట్టు లోపల భాగంలో రంధ్రం పడి సాగు నీరంతా వృధాగా బయటకు పోతుంది. మండలంలో మర్రిపాలెం పంచాయతీ శివారు మాదంపూడి గ్రామ సమీపంలో వెర్రిగెడ్డ ఆనకట్ట ఉంది. ఈ అనకట్ట నీరు ఆధారంగా ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి పంట 5వేల ఎకరాల్లో వేస్తుంటారు. తాండవ రిజర్వాయరు ఉన్నప్పటికీ మర్రిపాలెం డి.పంచాయతీలు పరిధిలో వెన్నలపాలెం, డి.యర్రవరం, డొంకాడ, మాదంపూడి, పొట్టిపాలెం, యరకంపేట, బాపన్నపేట కొత్త ఎల్లవరం తాండవ జంక్షన్ ములగపూడి గ్రామాలకు తాండవ ప్రాజెక్టు నీరు ప్రవహించదు. ఆయా గ్రామాల పరిధిలో రైతులంతా వెర్రిగెడ్డ ఆనకట్ట నీరుపై ఆధారపడి ఖరీఫ్‌లో రినాట్లు వేస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొండ గెడ్డల నుంచి నీరు అధిక మొత్తంలో వెర్రిగెడ్డ ఆనకట్టలోకి వచ్చి చేరింది. ఆనకట్ట గట్టు మట్టితో నిర్మించింది కావడంతో గట్టు లోపల భాగంలోంచి రంధ్రం ఏర్పడి నిత్యం సాగు నీరంతా వృధాగా పోతుంది. రంధ్రం పడిన ప్రదేశాన్ని గుర్తించిన రైతులు దానిని మసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో నీటి నిల్వలు అడుగంటిపోయాయి. ప్రస్తుతం అయకట్టు పరిధిలో రైతులంతా వరినాట్లు వేసుకుని కలుపు తీసుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ జేఈ రవికిరణ్‌ను వివరణ కోరగా గండి పడిన విషయాన్ని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. తాను స్వయంగా పరిశీలించి నీటి సంఘం ప్రతినిధులతో చర్చించి నీరు వృధాగా పోకుండా చర్యలు చేపడతామన్నారు.

వి-జ్యూయలరీ మార్ట్ రెండో షోరూమ్ ప్రారంభం


షోరూమ్‌ను ప్రారంభిస్తున్న కె.ఎస్.వి.ఎస్.గురుమూర్తి

బీచ్‌రోడ్డు: ఆశీలమెట్ట సంపత్ వినాయగర్ ఆలయ సమీపంలో వి-జ్యూయలరీ మార్ట్ రెండో షోరూమ్‌ను శ్రీకన్య ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్.వి.ఎస్.గురుమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వి-జ్యూయలరీ మార్ట్ భాగస్వాములు కోలా బాబురావు, కాకి గంగరాజు, పట్నాల శ్రీనివాసరావు, వూన వినీత్ మాట్లాడుతూ విమార్ట్ ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల 22 క్యారెట్ బంగారు ఆభరణాలను గ్రాము రూ.9,987 చొప్పున తరుగు 6.96 శాతం నుంచి పొందవచ్చన్నారు. అలాగే సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదని, జీఎస్టీని కస్టమర్ తరుపున తామే చెల్లిస్తామన్నారు. కేజీ వెండి వస్తువుల కొనుగోలుపై రూ.15,000 వరకు తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఆఫర్ కొన్ని రోజులు మాత్రమే ఉంటుందన్నారు.

చిరు వ్యాపారులపై ఇదేం దౌర్జన్యం

- అనకాపల్లి పట్టణ పరిధిలో హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



జోనల్ కార్యాలయం వద్ద చిరువ్యాపారులతో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనకాపల్లి: రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలతో కుటుంబాన్ని నేట్టుకొస్తున్న సమయంలో పట్టణ పరిధిలో రహదారులపై చిరు వ్యాపారం, తోపుడుబండ్లు, కూరగాయల దుకాణాలు పెట్టుకొని జీవిస్తున్న దుకాణాలపై జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వివి.శ్రీనివాసరావు అన్నారు. జోనల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. చిరు వ్యాపారులకు హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఏళ్ల తరబడి రోడ్ల పక్కన చిన్న చిన్న దుకాణాలు పెట్టుకొని వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్న పేదలపై రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ అధికారులు దౌర్జన్యానికి పాల్పడడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ఉపాధి చూపక, ఏ ఆధారం లేక రోడ్ల పక్కన చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుని జీవిస్తున్న వారికి ఉపాధి లేకుండా చేయడం ఎంతవరకు సమంజసం అని దుయ్యపట్టారు. పేదలను లక్షాధికారులను చేస్తానని చెబుతున్న సీఎం చంద్రబాబు జీవించడానికి చిరు వ్యాపారాలు చేసుకునే వారిని రోడ్డుపాలు చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. పేదలపై దౌర్జన్యాన్ని విరమించాలని, లేకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్, మండల కన్వీనర్ కాళ్ల తేలయ్యబాబు, శ్రీను, రమణ, లక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమావేశం...

ఆపరేషన్ లంగ్స్ పేరుతో జీవీఎంసీ అధికారులు పట్టణ పరిధిలో బడ్డీల తొలగింపు, చిరు వ్యాపారంపై దాడులు ఆపాలలని ఏపీ వీధి విక్రయదారులు ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన ముద్ర లోన్లు ,రోజువారి ప్రైవేట్ ఫైనాన్స్‌లు కట్టుకోలేక వస్తున్న ఆదాయం సరిపోక సతమతమవుతున్న విషయం అధికారులు ,ప్రజా ప్రతినిధులు గుర్తించాలని అన్నారు. సుప్రీంకోర్టు నిబంధనలను కూడా పక్కనపెట్టి వారికి అన్ని ప్రాంతాల్లో హాకర్స్ జోన్, గుర్తింపుకార్డులు మంచినీరు, టాయిలెట్స్ మరుగుదొడ్లు మంజూరు చేయాలని ఉన్నప్పటికీ ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా వారిని వెల్లగొట్టే చర్యలు ఆపాలన్నారు. యూనియన్ జిల్లా నాయకుడు నాగేశ్వరరావు, చిరు వ్యాపారులు జి త్రినాథ్, బంటు సూర్యనారాయణ, ఎ.వి. అప్పారావు, రామకృష్ణ, కొండలరావు, గురుమూర్తి ,బాబ్జి, పి ఎస్.ఆర్ రాజు, కోనేటి శ్రీనివాస్‌రావు, నాగు పాల్గొన్నారు.

'మహా' విస్తరణ

- జోన్ల వికేంద్రీకరణపై దృష్టి
- 8 నుంచి 10 జోన్లకు పెంపు
- కొత్తగా భీమిలి, గోపాలపట్నం జోన్లు
- రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్?

డాబాగార్డెన్స్ (విశాఖ): నగర జనాభా పెరుగుదల, సమీప గ్రామీణ ప్రాంతాల విలీనంతో ఒకప్పటి విశాఖ మున్సిపాలిటీ కార్పొరేషన్ అయ్యింది. కార్పొరేషన్ గ్రేటర్‌గా మారింది. 32 గ్రామాల విలీనంతో 72 వార్డులున్న జీవీఎంసీ 98 వార్డులు, 8 జోన్లకు చేరింది. ఇప్పుడు గ్రేటర్ కార్పొరేషన్ మరో అడుగు ముందుకేస్తోంది. కొన్ని గ్రామీణ ప్రాంతాల విలీనంతో పాటు, 8 జోన్లను 10 జోన్లుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపినట్లు తెలిసింది.

పరిధి పెరగనుంది

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మరింత విస్తరించనుంది. కొత్త విశాఖ జిల్లాలో కొన్ని గ్రామీణ ప్రాంతాలు జీవీఎంసీలోకి వచ్చే అవకాశముంది. విశాఖ మొత్తాన్ని జీవీఎంసీ పరిధిలోకి తీసుకురావాలని పాలకవర్గం భావిస్తోంది. దీంతో జీవీఎంసీ విస్తీర్ణం పెరుగుతుండడంతో కొత్త జోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఈ ప్రతిపాదనను కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. దీనికి ప్రభుత్వం కూడా ఆమోద ముద్ర వేసినట్టు సమాచారం.

10 జోన్లకు పెంపు

జీవీఎంసీ విస్తీర్ణం పెరిగితే పరిపాలన, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కష్టతరంగా మారుతుంది. ఈ సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు జోన్ల సంఖ్యను పెంచాలని పాలకవర్గం భావించింది. ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలో 8 జోన్లు ఉన్నాయి. ఒక్కో జోన్ పరిధి రెండు, మూడు నియోజకవర్గాలకు విస్తరించి ఉన్నాయి. అటువంటి పరిస్థితి లేకుండా ఉండేందుకు ఇప్పుడు ఒక్కో నియోజకవర్గం పరిధిలో ఒక జోన్ మాత్రమే ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జోన్ల వికేంద్రీకరణ పూర్తి చేశారు. ఒక నియోజకవర్గంలో ఉన్న వార్డులన్నీ ఒకే జోన్ పరిధిలోకి రానున్నాయి. అలాగే ఇప్పటి జోన్లుగా పిలిచే ఈ కార్యాలయాలు ఇకపై నియోజకవర్గ పేర్లతో ఏర్పాటు కానున్నాయి. దీని ప్రకారం విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ, పెందుర్తి, గాజువాక, భీమిలి, అనకాపల్లి పేర్లతో జోన్లు ఏర్పాటు కానున్నాయి. వీటితో పాటు కొత్తగా మరో రెండు జోన్లు ఏర్పాటు చేయనున్నారు. పెందుర్తిలో గ్రామీణ ప్రాంతాలు కలిస్తే పరిధి పెరుగుతుంది. దీంతో గోపాలపట్నం జోన్ కొత్తగా రానుంది. అలాగే ఆనందపురం, పద్మనాభం మండలాలు కలిస్తే ప్రస్తుతమున్న మధురవాడ జోన్ పరిధి భారీగా పెరగనుంది. దీంతో కొత్తగా భీమిలి జోన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 8 జోన్లు 10కి పెరగనున్నాయని సమాచారం. ఇప్పటికే ఈ ప్రతిపాదనలను పాలకవర్గం ప్రభుత్వానికి పంపింది. దీనిపై ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించింది. ఈ జోన్ల పెంపునకు ప్రభుత్వం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. త్వరలోనే తుది ప్రక్రియకు కసరత్తు జరగనున్నట్లు జీవీఎంసీలో చర్చ జరుగుతోంది.




పరిపాలన సౌలభ్యం.. పారదర్శకతకు

జీవీఎంసీ పరిపాలనలో అనూహ్య మార్పులు రానున్నాయి. పరిపాలన సౌలభ్యం, పారదర్శకతలో భాగంగా ఈ ప్రక్రియను గత కౌన్సిల్ సమావేశంలో శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు ఒక్కో జోన్ పరిధిలో 8 నుంచి 15 వార్డులు వరకు ఉన్నాయి. ఒక జోన్ పరిధిలో రెండు, మూడు నియోజకవర్గాలకు సంబంధించి ప్రాంతాలున్నాయి. దీంతో పరిపాలన సక్రమంగా ఉండడం లేదని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని మార్చాలని దీర్ఘకాలిక డిమాండ్ ఉంది. ఒక్కో నియోజకవర్గాన్ని ఒక జోన్‌గా చేయడం ద్వారా పరిపాలన సులభతరం అవుతుందని భావిస్తున్నారు.

జీవీఎంసీలోకి మండలాలు..

ఉమ్మడి విశాఖ విభజన తర్వాత విశాఖ జిల్లాగా మారాక పద్మనాభం, ఆనందపురం, పెందుర్తిలో కొన్ని గ్రామాలు జీవీఎంసీకి దూరంగానే ఉన్నాయి. దీంతో ఆయా మండలాలకు జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. తాజాగా మొత్తం విశాఖ జిల్లా అంతటినీ జీవీఎంసీ పరిధిలోకి తీసుకురావాలని సీఎం చంద్రబాబును ప్రజా ప్రతినిధులు విశాఖ పర్యటనలో కోరారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్‌ను సీఎం ఆదేశించారు. దీంతో ప్రస్తుతం మండలాలుగా ఉన్న ఆనందపురం, పద్మనాభం ప్రాంతాలను కూడా జీవీఎంసీ పరిధిలోకి తీసుకురావాలని భావిస్తున్నారు. అలాగే పెందుర్తిలో కొంత మేర జీవీఎంసీలో ఉన్నప్పటికీ మెజార్టీ విస్తీర్ణంలో ఇంకా అనేక గ్రామాలున్నాయి. వీటిని కూడా జీవీఎంసీ పరిధిలోకి తీసుకురానున్నారు. దీంతో జీవీఎంసీ విస్తీర్ణం భారీగా పెరగనుంది.

అగ్రిసెట్‌లో ర్యాంకుల పంట


ర్యాంకులు సాధించిన విద్యార్థులు

అనకాపల్లి టౌన్: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంకు అనుబంధంగా ఉన్న వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 2025 అగ్రిసెట్ ప్రవేశ పరీక్ష రాష్ట్ర స్థాయి ఫలితాల్లో పలు ర్యాంకులు పొందినట్టు కళాశాల ప్రిన్సిపాల్, పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు తెలిపారు. ఎల్.స్వరూప 9వ ర్యాంకు, వి.గౌరీశ్వరి, 10వ ర్యాంకు, పి. వెంకటేష్, 19వ ర్యాంకు, జి.అనూష 43వ ర్యాంకులు సాధించగా 100లోపు ర్యాంకులు 24 మంది, మరో 12 మంది విద్యార్థులు పలు ర్యాంకులు సాధించినట్టు తెలిపారు. వీరిని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చారులత, బోధన సిబ్బంది అభినందించారు.

వ్యాన్ ఢీకొని ఒకరి మృతి

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఉమ్మలాడ బైపాస్ రోడ్ జంక్షన్ వద్ద ఆటోను బొలేరో వ్యాన్ ఢీ కొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునగపాక మండలం మూలపేట గ్రామానికి చెందిన యల్లపు సూరి అప్పారావు బుధవారం ఉదయం ట్రెన్ దిగి ఆటోలో ఇంటికి బయలు దేరాడు. మార్గమధ్యంలో ఉమ్మలాడ బైపాస్ రోడ్ జంక్షన్ దాటుతుండగా విశాఖపట్నం వైపు నుంచి వస్తున్న బలేరో వ్యాన్ బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే విశాఖ కేజీహెచ్‌కి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడని తెలిపారు. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ నాగ సూరి అప్పారావుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు తండ్రి నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

శారదానదిని శుభ్రం చేయాలి

అనకాపల్లి టౌన్: శారదానదిని శుభ్రం చేయాలని వినాయక నిమజ్జన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.కుమారస్వామి కోరారు. ఈ మేరకు స్థానిక జీవీఎంసీ కార్యాలయంలో బుధవారం జెడ్సీని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ వినాయక నిమజ్జనాలు పూర్తయ్యాయని ఈ విగ్రహాల కర్రలు, ఇతర సామగ్రితో నదీ ప్రాంతం అధ్వానంగా తయారైందని, తక్షణం తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. విజయదశమిని పురస్కరించుకుని దుర్గమ్మ విగ్రహాల నిమజ్జనానికి ఆటంకం కలగకుండా నదిని శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవీఎస్ ప్రకాష్‌రావు, కె.హరినాథ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

అనకాపల్లి టౌన్: పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో ఉన్న అంబులెన్స్, ఇతర వాహనాల డ్రైవర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి చుట్టు పక్కల ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపరాదన్నారు. డీసీఎంఎస్ స్థలంలో పార్కింగ్ చేయడానికి ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం

కశింకోట: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్ కోరారు. మండలంలోని నూత లగుంటపాలెంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ నాలుగు నెలలు దాటిన పశువులన్నింటికి గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయాలని సూచించారు. చికిత్స కంటే నివారణ ఎంతో మేలని, సకాలంలో టీకాలు వేయడం వల్ల పశువులకు వ్యాధులు ప్రబలే అవకాశం తగ్గుతుందన్నారు. వచ్చే నెల 15 వరకు జరిగే కార్యక్రమాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జ్, పశు వైద్య సిబ్బంది రఘువీర, రాజేష్, భవాని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయ అభివృద్ధికి విరాళం



ఆదినారాయణ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని వేల్పులవీధి రజక కాలనీలో ఉన్న కనకదుర్గ అలయ అభివృద్ధికి రిటైర్డ్ లెక్చరర్ పప్పల ఆదినారాయణ దంపతులు రూ.15 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు వారిని శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

గాలికుంటు.. భయం లేదిక.!

- పశువులకు రక్షణగా ముమ్మరంగా వ్యాక్సినేషన్
- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ప్రక్రియ
- మండలంలో 16,250 పశువులకు టీకాలు వేయాలని లక్ష్యం
- ఇప్పటికే దాదాపు 4,300 పశువులకు పూర్తి



కశింకోటలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేస్తున్న మండల పశు వైద్యాధికారి సిహెచ్.చైతన్యమణి, సిబ్బంది

కశింకోట: అన్నదాతలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే ప్రస్తుత రోజుల్లో వ్యవసాయంతో పాటు పశు పోషణ తప్పనిసరి. అయితే సీజనల్‌లో వచ్చే వ్యాధులు పాడి పరిశ్రమను భయపెడుతున్నాయి. వర్షాకాలంలో పశువులకు అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంది. తద్వారా పశువుల్లో పాల దిగుబడులు తగ్గిపోతుంటాయి. దుక్కి పశువుల సామర్థ్యం తగ్గిపోవడం, పెయ్యిలు ఎదకు రాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ఇటువంటి నేపథ్యంలో వర్షాకాలంలో పశువులకు సోకే వివిధ వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్యులు పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

చురుగ్గా వ్యాక్సినేషన్

మండలంలో పశువులకు రక్షణగా గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే 25 శాతం మేర వ్యాక్సిన్ వేశారు. ఇంకా 75 శాతం వేయాల్సి ఉంది. లక్ష్యాన్ని వచ్చే నెల 15వ తేదీలోగా పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గాలికుంటు వ్యాధి పశువులకు ప్రాణాంతకంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా చేపట్టింది. ఏటా కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిర్వహిస్తుంటుంది. దీనిలో భాగంగా మండలంలో ఈ నెల 15న కార్యక్రమాన్ని ప్రారంభించారు. 4 నెలల వయస్సు దాటిన ఆవు, గేదెల పెయ్యిలు మొదలుకొని ఆరోగ్యంగా ఉన్న పెద్ద పశువుల అన్నింటికీ పాకల వద్దకు వెళ్లి టీకాలు వేస్తున్నారు. మండలంలో 16,250 పశువులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో ఇప్పటికే 4,300 పశువులకు టీకాలు వేసినట్లు అధికారిక సమాచారం. కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, తాళ్లపాలెం, నరసింగబిల్లి, కన్నూరుపాలెం, కొత్తపల్లి, అచ్చెర్ల, తేగాడ, ఏఎస్ పేట, నూతలగుంటపాలెం, తదితర గ్రామాల్లో ఇప్పటికే ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించి, పశువులకు టీకాలు వేశారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు

- తీవ్ర జ్వరం, నీరసం
- కొద్దిపాటి ఎండకు సైతం పశువుల్లో అలసట
- దుక్కి ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గడం
- పాలు తాగే దూడల్లో మరణాలు
- చికిత్స విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే పశువుల మృతికి అవకాశం.

ప్రయోజనాలు

- వ్యాధి సోకిన పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తి పెంచవచ్చు
- వ్యాధి సోకిన దుక్కి ఎద్దుల్లో పని సామర్థ్యం పెంపు
- దూడల్లో మరణాలు తగ్గించి ఆరోగ్యంగా ఎదుగుదలకు దోహదం
- పశువుల గుర్తింపునకు చెవికి పోగు వేయడం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి.

టోల్ ఫ్రీ నంబరు 1962

పశువులకు సీజన్‌లో వచ్చే అంటువ్యాధుల సమస్యలను నివృత్తి చేసేందుకు వీలుగా జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా 1962 టోల్ ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రధానంగా గాలికుంటు వ్యాధి సమస్యకు సంబంధించి ఎటువంటి సమస్య వచ్చినా నేరుగా ఫోన్ చేసేందుకు అవకాశం కల్పించారు.

15లోగా లక్ష్యాన్ని చేరుకుంటాం..

మండలంలో 16,250 పశువులుండగా.. గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఈ నెల 15న చేపట్టాం. ఇప్పటికే 4,300 పశువులకు వ్యాక్సిన్ వేశాం. మిగిలిన వాటికి వచ్చే నెల 15లోగా వ్యాక్సిన్ వేసే ప్రక్రియను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. రైతులు తప్పనిసరిగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేయించాలి.

– సిహెచ్.చైతన్యమణి, మండల పశు వైద్యాధికారి, కశింకోట

మాజీ సీఎం జగన్‌తో ఆత్మీయ భేటీ



వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనకాపల్లి నియోజకవర్గంలో ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేశామని, కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే వరకూ ప్రజలతో కలిసి ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నట్టు భరత్‌కుమార్ మాజీ సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. – అనకాపల్లి

గ్రామీణ బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ



గ్రామీణ వికాస బ్యాంకు భవనం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి

కశింకోట: ఏపీ గ్రామీణ బ్యాంకు మాత్రమే డిపాజిట్లపై అత్యధిక శాతం వడ్డీని అందజేస్తుందని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం ఏపీ గ్రామీణ బ్యాంకు నూతన భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు 1975లో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ రంగానికి చెందిన ఈ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం, యూనియన్ బ్యాంకు 35 శాతం వంతున వాటాలను కలిగి ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అత్యధిక వినియోగదారులు కలిగిన రెండో బ్యాంకుగా, అత్యధిక శాఖలున్న బ్యాంకుగా గ్రామీణ వికాస బ్యాంకు గుర్తింపు పొందిందన్నారు. ఏటా రూ.లక్షా 20 వేల కోట్ల లావాదేవీలు గ్రామీణ బ్యాంకు ద్వారానే జరుగుతున్నాయన్నారు. తాళ్లపాలెం బ్రాంచి వంద కోట్ల టర్నోవర్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ బ్రాంచిలో ప్రస్తుతం 89 కోట్ల టర్నోవర్ కలిగి 12 వేల మంది ఖాతాదారులున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సతీష్ చంద్ర, మేనేజర్ మల్లవరపు మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు జెడ్సీ ప్రత్యేక పూజలు



జెడ్సీ చక్రవర్తి దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో దసరా నవరాత్రుల ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జెడ్సీ చక్రవర్తి కోరారు. స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మని చక్రవర్తి దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. అనంతరం చక్రవర్తి దంపతులను ఆలయ కమిటీ సభ్యుడు కె.ఎం.నాయుడు శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని జెడ్సీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాటికలకు అనకాపల్లి పుట్టినిల్లు



ఆవేశంలో ఆనందం హాస్య నాటికలో ఓ సన్నివేశం

అనకాపల్లి: నాటికలకు అనకాపల్లి పుట్టినిల్లని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. సతకంపట్టు కనకదుర్గమ్మ ఉత్సవాల్లో భాగంగా స్థానిక గవరపాలెం గౌరీ సేవ సంఘంలో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. తొమ్మిది సంవత్సరాలుగా దేవీ నవరాత్రుల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.

ఆలోచింపజేసిన ‘ఆవేశంలో ఆనందం’

మల్లాది రవి కిరణ్ రచించిన, మల్లాది భాస్కర్ దర్శకత్వం వహించిన ఆవేశంలో ఆనందం నాటిక అందర్నీ ఆలోచింపజేసింది. చావు మన చేతుల్లో ఉండదు–ఎలా బతకాలో మాత్రమే ఉంటుంది. మనం తయారు చేసిన వస్తువులకు కాలపరిమితి ఉంటుంది. కానీ మనిషికి కాలపరిమితి రోజు మాత్రం మనల్ని సృష్టిరచిన దేవుడి దగ్గరే ఉంటుంది. ఈ రోజుల్లో ఎందరో చిన్న చిన్న విషయాలకు ఆవేశపడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వారి బతుకు ఆ కుటుంబానికి ఎంత అవసరమో తెలియజెప్పే విధానమే ఈ ‘ఆవేశంలో ఆనందం’హాస్య నాటిక సారాంశం.

ఆకట్టుకున్న ‘ఇది అతని సంతకం’

ప్రతి మనిషి జీవితంలో ఒక గోల్ ఉంటుంది. ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ఉంటుంది. ఒక బలమైన నిర్ణయం, వాటిని అచరణలో పెట్టి సాధించుకోగల వారి జీవితం పరిపూర్ణమవుతుంది. సమస్యలు వస్తాయి.. ఎదిరించాలి.. కానీ రాజీపడితే ఆ మనిషి వ్యక్తిత్వం చచ్చిపోతుంది. సమయస్ఫూర్తితో ఇంటి బయటా నెగ్గకు రాగలిగే వాడే నిజమైన యజమాని అవుతాడు. ఆ కోవకు చెందిన వ్యక్తి ఈ కథలో ప్రధాన పాత్రధారి, సూత్రధారి కృష్ణమూర్తి. అబద్ధం లేని జీవితంలో జీవించాడు. తన నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రయాణించాడు. వేసే ప్రతి అడుగులోనూ తన ప్రత్యేకతను చాటుకున్నాడు. జీవితపు చరమాంకపు దశలో దంపతులు ఎలా బతకాలో రాసుకున్న సారాంశంతో ‘ఇది అతని సంతకం’ నాటిక ప్రదర్శన సాగింది. ఈ కార్యక్రమంలో నాటికల నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, కర్రి సన్యాసినాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నపూర్ణదేవిగా దుర్గమ్మ కనువిందు



కశింకోట పెద్దబజారులో ఛత్రపతి శివాజీ పూజిస్తున్న దుర్గమ్మ విగ్రహం



కశింకోట గౌరమ్మ ఆలయం వద్ద ముగ్గురమ్మల మూలపుటమ్మగా సరస్వతి, లక్ష్మీదేవిలతో కొలువై ఉన్న దుర్గమ్మ



కశింకోట శివాలయంలో అన్నపూర్ణదేవిగా సర్వ మంగళాంబ అమ్మవారు



కశింకోట ఆలయంలో అన్నపూర్ణదేవిగా కనక దుర్గమ్మ అలంకరణ



ధనలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరిదేవి



గాయత్రిదేవి అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ



నూకాంబిక అమ్మవారి ఆలయంలో లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత



కామాక్షిదేవి ఆలయంలో భరతనాట్యం చేస్తున్న విద్యార్థులు



గౌరీపంచాయతీ దేవాలయంలో సరస్వతి దేవి అలంకరణలో గౌరీ దేవి

కశింకోట: దసరా ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం దుర్గాదేవి అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కశింకోట వద్ద ఉన్న కనకదుర్గ ఆలయంలో, స్థానిక శివాలయంలో ఉన్న సర్వమంగళాంబ అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. శివాలయంలో అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణ ఆధ్వర్యంలోను, కనకదుర్గ ఆలయంలో ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో సహస్ర నామాలతో ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. స్థానిక గౌరమ్మ ఆల యం వద్ద దసరా ఉత్సవాల్లో భాగంగా ముగ్గురమ్మల మూలపుటమ్మగా సరస్వతి, లక్ష్మీదేవిల విగ్రహాలతో పాటు నెలకొలిపిన దుర్గమ్మ విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. పెద్ద బజారులో ఛత్రపతి శివాజీ పూజిస్తున్నట్లు సింహంపై కొలువై ఉన్న దుర్గమ్మ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంలో పట్టణంలో పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉత్సవ విగ్రహానికి శ్రీచక్ర అభిషేకాలు, నక్షత్ర హారతి, గోపూజ, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ.. గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భవానీ భక్తులకు అన్నదానం చేశారు.
- స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారిని కలెక్టర్ విజయకృష్ణన్ దర్శించుకున్నారు. ఆలయంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం గంటా రాఘవ లక్ష్మి కృష్ణ, గ్రంధి గణేష్ లక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.
- స్థానిక నిదానందొడ్డిలో కామాక్షిదేవి.. ధనలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఆవరణలో సిరి స్పందన నృత్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులు భరత నాట్యం ప్రదర్శించారు.
- స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీదేవి.. సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సిరిడాన్స్ అకాడమీ ప్రతినిధి శరగడం ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో భరతనాట్యం ప్రదర్శించారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న అనకాపల్లి సబ్ డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మరిడయ్య

కశింకోట: కశింకోట పీఏసీఎస్‌లో యూరియాతో పాటు ఇతర ఎరువులను అందుబాటులో ఉంచాలని రైతులు కోరారు. సంఘ సర్వసభ్య సమావేశం బుధవారం సంఘ ఆవరణలో జరిగింది. సభకు అధ్యక్షత వహించిన సంఘ పర్సన్ ఇన్‌ఛార్జి, అనకాపల్లి సబ్ డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మరిడయ్య మాట్లాడుతూ సంఘానికి గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.16.58 లక్షల నికర లాభం వచ్చిందన్నారు. ప్రస్తుతం 5867 మంది సభ్యులు కలిగి రూ.17.27 కోట్ల మేర టర్నోవర్‌తో నడుస్తుందన్నారు. సంఘ సీఈవో ద్వారపురెడ్డి నూకేశ్వరరావు సంఘ జమా ఖర్చులు, ఆడిట్ నివేదిక చదివి వినిపించారు. అంచనా బడ్జెట్, వాస్తవ బడ్జెట్, జమా ఖర్చులను సమావేశం ఆమోదించింది. సభ్య రైతులు నడిపల్లి సన్యాసిరావు, పందల ఎల్లయ్యనాయుడు, అల్లవరపు నాగు, పోతల రామారావు, గొంతిన అప్పారావు, కుకలా రమణ, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వన్ టైం సెటిల్‌మెంట్‌కు తీర్మానం

నరసింగబిల్లి పీఏసీఎస్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో దీర్ఘకాలిక రుణ బకాయిలు చెల్లింపునకు వన్‌టైం షెటిల్‌మెంట్‌ను అమలు చేయాలని కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్, సీఈవోలను కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించారు. సంఘ సీఈవో నక్కా అచ్చియ్యనాయుడు సంఘ జమా ఖర్చులు, ఆడిట్ నివేదికను చదివి వినిపించారు. అంచనా, వాస్తవ బడ్జెట్‌లను సమావేశం ఆమోదించాయి. సమాచార హక్కు చట్టంపై ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కలిగించారు. సంఘ చైర్ పర్సన్ ఏఈ సుబ్రహ్మణ్యేశ్వరి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మలసాల కిషోర్, మండల సచివాలయ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కలగ గున్నయ్యనాయుడు, కూటమి నాయకులు, రైతులు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఏటికొప్పాకలో యూరియా కష్టాలు



ఏటికొప్పాక సచివాలయం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

యలమంచిలి రూరల్: మునుపెన్నడూ లేని విధంగా కూటమి సర్కారు నిర్వాకంతో పంటలకు అవసరమైన ఎరువు వేయలేని దుస్థితి నెలకొంది. 2019–24 మధ్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఐదేళ్లూ ఎక్కడా యూరియా సమస్య ఎదురుకాలేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. యలమంచిలి మండలంలో ఎక్కడా యూరియా కొరత లేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. బుధవారం యలమంచిలి మండలం ఏటికొప్పాక సచివాలయం వద్ద యూరియా పంపిణీ కోసం రైతులు పడిన కష్టాలే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి రైతులు సచివాలయం వద్ద గంటల తరబడి క్యూలైన్లో ఎండలో పడిగాపులు పడ్డారు. మధ్యాహ్నం 12 గంటలైనా యూరియా పంపిణీ ప్రారంభించకపోవడంతో రైతులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అవసరమైనంత యూరియా పంపించకపోవడంతో రైతులు తోపులాటలకు దిగాల్సి వస్తోందని, ఒక బస్తా యూరియా కోసం రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏటికొప్పాక గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు శ్రీనివాసరావు మండిపడ్డారు.

పగలే వెలుగులు!



కొత్తపల్లిలో పగలే వెలుగుతున్న వీధి దీపాలు

కశింకోట: కొత్తపల్లి గ్రామంలో వీధి లైట్లు పగలే వెన్నెల కురిపిస్తున్నాయి. దీంతో స్థానికులు విస్తుపోతున్నారు. పంచాయతీకి చెల్లించే పన్నుల ద్వారా విద్యుత్ బిల్లుల భారం తమపై పడుతుందని ఒకింత బాధ వ్యక్తం చేస్తున్నారు. సుమారు గత 15 రోజుల నుంచి రాత్రితో పాటు పగటి పూట కూడా నిరంతరాయంగా విద్యుత్ వీధి దీపాలు వెలుగుతున్న విషయాన్ని ఫిర్యాదు చేసినప్పటికి పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 70 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,200	4,830
రెండో రకం	నిల్	నిల్
మూడవ రకం	3,750	3,750

అనకాపల్లి సినిమాలు

రాజా	: ఓజీ
సత్యనారాయణ స్క్రీన్-1	: కిష్కింధపురం
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: ఓజీ
షిర్డీసాయి	: ఓజీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఎ పాజిటివ్-3, బి పాజిటివ్-9, ఒ పాజిటివ్-19, ఏబీ పాజిటివ్-3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్(ఫోన్ నంబర్ 9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.